జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం

బుధవారం | 5 | ఆగస్టు | 2026 • పేజీలు : 5

# కారేపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్



**కారేపల్లి, ఆగస్టు 4, ప్రజాజ్యోతి:** కారేపల్లి పోలీస్ స్టేషన్ ను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ కు నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు

మిగతా 2 లో...





- ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బలమైన పునాది
- డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్

# తల్లిపాలు బిడ్డకు జీవన ప్రసాదం

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి**

ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7 వరకు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే "ప్రపంచ తల్లిపాల వారోత్సవాల" సందర్భంగా చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ముఖ్య సందేశాన్ని విడుదల చేశారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే అత్యంత శ్రేష్ఠమైనవని ఆయన స్పష్టం చేశారు.

**తొలి పాలు (ముర్రుపాలు) – బిడ్డకు మొదటి టీకా:**

కాన్పు అయిన మొదటి గంటలోనే బిడ్డకు పాలు పట్టడం అత్యంత ఆవశ్యకం. తొలి రోజుల్లో వచ్చే ముర్రుపాలు బిడ్డకు మొదటి రక్షణ కవచంలా పనిచేస్తాయి. వీటిలో ఉండే రోగనిరోధక శక్తులు, యాంటీబాడీలు బిడ్డను రకరకాల ఇన్ఫెక్షన్ల నుండి కాపాడుతాయి.

**మొదటి 6 నెలలు కేవలం తల్లిపాలే:**

శిశువు జన్మించిన మొదటి 6 నెలల పాటు ఎలాంటి నీరు గానీ, ఇతర ఆహారం గానీ ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలి. బిడ్డకు కావలసిన నీరు, పోషకాలు, విటమిన్లు అన్నీ సరిపడా నిష్పత్తిలో తల్లిపాలలోనే లభిస్తాయి.

**శారీరక, మానసిక ఎదుగుదల:**

తల్లిపాలు తాగే పిల్లలలో మేధోశక్తి ,జ్ఞాపకశక్తి, మానసిక వికాసం మెరుగ్గా ఉంటాయి. అలాగే భవిష్యత్తులో స్థూలకాయం,మధుమేహం, గుండె జబ్బులు,

మిగతా 2 లో...

# పోషకాహారంతో పాఠశాలల్లో కొత్త అధ్యాయం

- కౌన్సిలర్ రాధ



**కల్లూరు ఆగస్టు 04: ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉదయకాలపు అల్పాహారం పథకం కల్లూరు పట్టణంలోని పడమటి హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 19వ వార్డు కౌన్సిలర్ ఖమ్మం పాటి రాధా వీరయ్య పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. తొలి రోజు విద్యార్థులకు రాగి ఇడ్లీ చట్నీ పాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా రాధా వీరయ్య మాట్లాడుతూ విద్యార్థుల శారీరక మానసిక వికాసాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అల్పాహార పథకం ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఈ పథకం వల్ల విద్యార్థుల హాజర శాతం పెరగడంతో పాటు పాఠశాలకు ఆలస్యంగా వచ్చే వారి సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు బి రత్న మాధురి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థి వాటి ప్రయోజనాలు పొందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు స్థానిక పెద్దలు

మిగతా 2 లో...

# తలసేమియా బాధితులకు 'రితన్య హాస్పిటల్' అండ

- రక్తదాతలు, ప్రభుత్వం స్పందించాలని డాక్టర్ నారాయణమూర్తి విజ్ఞప్తి



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి :** తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రితన్య హాస్పిటల్ నిరంతర సేవలు అందిస్తోంది.ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ నారాయణమూర్తి (ఎండీ ) ఆధ్వర్యంలో సుమారు 250మంది తలసేమియా బాధిత పిల్లలకు ప్రతినిత్యం ఆసుపత్రిలో ఉచితంగా రక్తం ఎక్కించే ప్రక్రియను నిరాటంకంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ నారాయణమూర్తి మాట్లాడుతూ... "శరీరంలో తగినంత రక్తం ఉత్పత్తి కాకుండా జన్మించడమనేది ఆ పిల్లలు చేసిన పాపం కాదు. అది ఒక జన్యుపరమైన సమస్య. రక్తం లేక నరకయాతన

మిగతా 2 లో...

# ఇద్దరు నిందితులు అరెస్ట్

- ఏసీపీ కల్లూరు వసుంధర యాదవ్



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి :** ఏన్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంపురం తండాలో ఇటీవల జరిగిన ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ కేసును ఏన్కూర్ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి, నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతో పాటు చోరీకి గురైన బంగారు పుస్తెలతాడును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన నిందితులు భూక్య హర్షవర్ధన్, శ్రీరాంపురం తండా, ఏన్కూర్ మండలం మరియు బానోత్ కిషోర్ కొత్త తండా, టేకులపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నివాసులు.వీరిద్దరూ హైదరాబాద్‌లోని జెడ్ ఈ పి టి ఓ సంస్థలో ఉద్యోగాలు చేస్తూ ఒకే చోట నివాసం ఉంటున్నారు.దర్యాప్తులో నిందితులు తెలిపిన వివరాల ప్రకారం, భూక్య హర్షవర్ధన్ స్నేహితుల దగ్గర సుమారు రూ.1 లక్ష

మిగతా 2 లో...

## తల్లిపాలు బిడ్డకు జీవన ప్రసాదం

(మొదటి పేజీ తరువాయి...)



ఆస్తమా వంటి దీర్ఘకాలిక సమస్యలు వచ్చే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది.తల్లికి కూడా ఎంతో మేలు. పాలు ఇవ్వడం వల్ల కేవలం బిడ్డకే కాకుండా తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.కాన్పు తర్వాత తల్లి గర్భాశయం సాధారణ స్థితికి రావడానికి, అధిక బరువు తగ్గడానికి ఇది తోడ్పడుతుంది. అంతేకాకుండా రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, ఎముకల బలహీనత వంటి వ్యాధుల బారిన పడకుండా తల్లిని కాపాడుతుంది.

**తల్లి–బిడ్డల బంధం:**
పాలు ఇచ్చే సమయంలో తల్లి మరియు బిడ్డ మధ్య ఏర్పడే స్పర్శ, అనురాగం బిడ్డలో భద్రతా భావాన్ని పెంచుతుంది. ఇది వారి మధ్య ప్రేమానుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

**సమాజానికి పిలుపు:**
ఆధునిక జీవనశైలి, రకరకాల అపోహల వల్ల చాలామంది పాలు ఇవ్వడానికి వెనకాడుతున్నారని, కుటుంబ సభ్యులు మరియు సమాజం పాలు ఇచ్చే తల్లికి పూర్తి మద్దతుగా నిలవాలని డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ కోరారు. ఉద్యోగం చేసే తల్లులకు కూడా వారు పనిచేసే ప్రాంతాల్లో తగిన వసతులు కల్పించాలని సూచించారు.బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ఒక బాధ్యత మాత్రమే కాదు, అది బిడ్డకు మనం ఇచ్చే అత్యంత విలువైన ఆరోగ్య కానుక. ప్రతి తల్లి ఈ విషయాన్ని గుర్తుంచుకుని, తమ పిల్లలకు పాలు అందించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలి అని డాక్టర్ ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు.

## పోషకాహారంతో పాఠశాలల్లో కొత్త అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి...)

అల్పాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోడూరు కిరణ్ కుమార్, సహోపాధ్యాయుడు గుర్రాల సుధీర్, మాజీ వార్డ్ సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కనకపుడి జయరాజు, రావూరి సీతారాములు, ఖమ్మంపాటి వెంకటలక్ష్మి, కంటిపూడి రాణి కాకటి వసంత నల్లగట్ల స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్

(మొదటి పేజీ తరువాయి...)

పరిసరాలను పరిశీలించారు. సెక్టర్ పోలీస్ ఆఫీసర్లతో మాట్లాడారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. సర్కిల్ కార్యాలయాన్ని నూతన అంగులతో మరమతులు చేయించినందుకు సీఐ నూనావత్ సాగరను అభినందించారు.నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ..వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. రౌడీ షీటర్లపై దృష్టి పెట్టాలని, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖ వారు నూతనంగా ప్రవేశపెట్టిన వివిధ ఆన్లైన్ యాప్ ల గురించి వివరించారు.బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీబి .తిరుపతి రెడ్డి, సిఐ ఎన్.సాగర్, ఎస్సై బి.గోపి, పి.శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా బాధితులకు ‘రితన్య హాస్పిటల్’ అండ

(మొదటి పేజీ తరువాయి...)

అనుభవిస్తున్న ఆ పసిపాపలకు రక్తాన్ని దానంచేసి ప్రాణాలు కాపాడటం అంటే మరో పునర్జన్మ ఇవ్వడమే" అని ఆవేదన వ్యక్తం చేశారు.తలసేమియా పిల్లలు ఆరోగ్యంగా జీవించాలంటే క్రమం తప్పకుండా రక్తం మార్పిడి అవసరమని, దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.బాధిత కుటుంబాలకు ఈ చికిత్స భారం కాకూడదనే ఉద్దేశంతో రితన్య హాస్పిటల్ ద్వారా నిరంతరం ఈ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.అయితే ప్రాణాపాయంలో ఉన్న పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగం కూడా తక్షణమే స్పందించాలని కోరారు.తలసేమియా పిల్లల కోసం ప్రత్యేకంగా ‘బ్లడ్ బ్యాంక్’ (రక్త నిధి) ఏర్పాటు చేసి,ఉచితంగా రక్తాన్ని అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ నారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు.సమాజంలోని స్వచ్ఛంద సంస్థలు, యువత, దాతలు మానవత్వంతో స్పందించి నిరంతరం రక్తదానం చేస్తూ ఈ పసికందుల జీవిత కాంతులను కాపాడాలని రితన్య హాస్పిటల్ యాజమాన్యం కోరుతోంది.

# ఇద్దరు నిందితులు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి...)

మేర అప్పులు చేశాడు. ZEPTOలో వచ్చే జీతం ఆ అప్పులు తీర్చడానికి సరిపోకపోవడంతో పాటు, కుటుంబ సభ్యులు కూడా అదనపు డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పు ఇచ్చిన వ్యక్తులు అతనిపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ఎలాగైనా త్వరగా డబ్బు సంపాదించి అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్నాడు.ఈ క్రమంలో తనతో కలిసి హైదరాబాద్ లో పని చేస్తున్న దూరపు బంధువు బానోత్ కిషోర్కు తన అప్పుల విషయం వివరించాడు. తేదీ 31-07-2026న కొత్తగూడెంలోని సెంట్రల్ పార్క్ వద్ద ఇద్దరూ కలుసుకుని సాయంత్రం వరకు కలిసి తిరిగారు. అనంతరం ఏన్కూర్ మండలం తిమ్మరపేట గ్రామానికి వచ్చి ఒక బెల్ట్ షాపులో మూడు బీర్లు కొనుగోలు చేసి గ్రామ శ్మశానవాటికలో కూర్చొని మద్యం సేవించారు.మద్యం సేవిస్తున్న సమయంలో హర్షవర్ధన్ తనకు ఉన్న అప్పుల గురించి కిషోర్ కు వివరించి,వాటిని తీర్చుకోవడానికి ఇంట్లో ఉన్న బంగారం దొంగతనం చేయాలని ప్రతిపాదించాడు.మొదట తన నానమ్మ నాగమ్మ మెడలో ఉన్న బంగారు చైన్ దొంగతనం చేద్దామని భావించినప్పటికీ, కుటుంబ సభ్యులకు తనపై అనుమానం వస్తుందని భావించి ఆ ఆలోచనను విరమించుకున్నాడు. అనంతరం తన పెద్దతాత తావూరియా భార్య సాంఖలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును దొంగతనం చేయాలని ఇద్దరూ ముందస్తుగా ప్రణాళిక రూపొందించారు. దొంగతనం చేసిన బంగారాన్ని హైదరాబాద్ కు తీసుకెళ్లి అక్కడ విక్రయించి వచ్చిన డబ్బుతో ముందుగా హర్షవర్ధన్ అప్పులు తీర్చుకుని, మిగిలిన మొత్తాన్ని ఇద్దరూ పంచుకోవాలని నిర ్ణయించుకున్నారు. ప్రణాళిక ప్రకారం అదే రోజు అర్ధరాత్రి సుమారు 12.00 గంటలకు హర్షవర్ధన్ తన గ్రామానికి కిషోర్ ను తీసుకెళ్లి,ఇంట్లోకి ప్రవేశించే మార్గాన్ని చూపించాడు. ముందుగా ఇంట్లో ఉన్నవారంతా గాఢ నిద్రలో ఉన్నారో లేదో నిర్ధారించుకున్నారు.అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ప్రధాన రోడ్డుపై ఉన్న వీధి విద్యుత్ దీపాన్ని ఆఫ్ చేయాలని హర్షవర్ధన్ కిషోర్ కు చెప్పగా, కిషోర్ వెళ్లి వీధి లైట్ ఆఫ్ చేసి తిరిగి వచ్చాడు. ఆ తరువాత ఇద్దరూ కలిసి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లోని బాత్రూమ్ లో ఉన్న బ్లేడ్ ను తీసుకున్న హర్షవర్ధన్, నిద్రిస్తున్న సాంఖలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును బ్లేడ్ తో కట్ చేసి అపహరించాడు. ఆమె కదలిక గమనించగానే ఇద్దరూ వెంటనే అక్కడి నుంచి పరుగెత్తి గ్రామం బయటకు వెళ్లిపోయారు. చోరీ చేసిన బంగారు పుస్తెలతాడును వెంటనే అమ్మితే అనుమానం వస్తుందని భావించి, కొద్ది రోజులు హర్షవర్ధన్ తన వద్దే దాచుకున్నాడు. అనంతరం హైదరాబాద్ వెళ్లి అక్కడ విక్రయించి డబ్బును పంచుకోవాలని నిర్ణయించారు.కేసు నమోదు అనంతరం ఏన్కూర్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచారు. మంగళవారం ఉదయం ఏన్కూర్ పోలీసులు తూతిక్కలింగన్నపేట బ్రిడ్జి సెంటర్ వద్ద ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించి నిందితుల నుండి బంగారం స్వాధీనం చేసుకుని వారిని కోర్ట్ నందు హాజరు పరచడం జరిగింది.ఈ సందర్భంగా ఏసీపీ కల్లూరు వసుంధర యాదవ్ మాట్లాడుతూ అప్పుల ఒత్తిడి యువతను నేరాల వైపు నెడుతున్నాయని, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా చట్టవిరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన ఏన్కూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్ స్పెక్టర్ ఎన్.సంధ్యని నిందితులను గుర్తించి వారిని అరెస్ట్మ చేయడం లో చాకచక్యంగా వ్యవహరించిన హెచ్ సి శ్రీహరి,కానిస్టేబుల్ రాజా,దేవేంద్ర,రవి,శంకర్,వినయ్ హోమ్ గార్డ్ రాము లను ఏసీపీ శ్రీమతి వసుంధర యాదవ్ అభినందించారు.

# ధరల పెరుగుదల, ఎంబీఎస్పీపై కేంద్రం వైఫల్యం

- నేలకొండపల్లిలో సిపిఐ నిరసన పోస్టర్ ఆవిష్కరణ



**నెలకొండపల్లి, ఆగస్టు 4 ప్రజా జ్యోతి:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సమరశంఖం పూరించింది. "బదలావ్ జరూరీ హై – మార్పు కావాలి" అనే నినాదంతో చేపడుతున్న విస్తృత నిరసన ప్రచార కార్యక్రమ పాదయాత్రల పోస్టరను మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (MSP)కు చట్టబద్ధత కల్పించడంలో మరియు కార్మికుల సత్వర హక్కులను పరిరక్షించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ నిరంకుశ, ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా ఆగస్టు 6 నుండి 14 వరకు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా చైతన్య పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రల ద్వారా కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను ప్రజల్లో ఎండగడతామని, అనంతరం సెప్టెంబర్ 1న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడేందుకు నిర్వహిస్తున్న ఈ పాదయాత్రలు మరియు 'చలో ఢిల్లీ' పిలుపులో నేలకొండపల్లి మండల ప్రజలు, రైతులు, కార్మికులు, యువత విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ కౌన్సిల్ సభ్యులు కాశబోయన అయోధ్య,అనంతు పుల్లయ్య, వాసం శెట్టి వేంకటేశ్వర్లు, నాగయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆశా డే కార్యక్రమం



**ఎర్రుపాలెం, ప్రజాజ్యోతి** మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అశ్విని, డాక్టర్ వెంకట్ లాల్ ఆధ్వర్యంలో మంగళ వారం ఆశా డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా బాలికలు,మహిళలు, గర్భిణీ లలో రక్తహీనత, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు గురించి ఆశా కార్యకర్తలతో వివరిస్తూ వీరందరికీ రక్తహీనత లేకుండా ఉండాలంటే పౌష్టికాహారం లో భాగంగా ఆకుకూరలు, పండ్లు, గుడ్లు,ప్రతిరోజు ఆహారంలో ఉండే విధంగా చూసుకోవాలని, ప్రతి గర్భిణీ బనిగండ్లపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా కృషి చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగితేనే సుఖ ప్రసవం జరిగే అవకాశం ఉంటుందని, ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే సిజేరియన్ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తద్వారా గర్భిణీ కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని, ఆర్థిక భారం పడుతుందని, అందరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ ప్రవీణ్, సిహెచ్ఓ కాంతమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్ వైజర్లు లంకా కొండయ్య, లతాశ్రీ, హెల్త్ అసిస్టెంట్లు, ఎమ్మెల్ హెచ్పి పి లు, ఏఎన్ఎం లు, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారులను కలిసిన ఐఎన్‌టీయూసీ బృందం

- **నూతన అధికారులకు ఘన స్వాగతం పలికిన ఐ ఎన్ టి యు సి..వైస్ కోటేశ్వరరావు**





**సత్తుపల్లి ఆగస్టు04(ప్రజా జ్యోతి)** సింగరేణి సంస్థ కార్పొరేట్ హెడ్ ఆఫీసులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాద పూర్వకంగా మంగళవారం కలిసి పుష్పగుచ్చాలు అందజేసి, ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా జి.వి. కిరణ్ కుమార్ (జి.ఎం. పర్సనల్, ఐఆర్, పీఎం), కె. అజయ్ కుమార్ (జి.ఎం. పర్సనల్ వెల్ఫేర్,సీఎస్ఆర్), శివ కేశవరావు (జి.ఎం. పర్సనల్స్), రాజేంద్ర ప్రసాద్ (జి.ఎం. ఎడ్యుకేషన్)లను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లే బాధ్యత నూతన అధికారులపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో సింగరేణిలో కొత్త గనులను ప్రారంభించి, యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే ఉద్యోగుల ప్రమోషన్లు, సర్వీస్ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కొత్తగా ఏర్పడిన సత్తుపల్లి ఏరియాలో సింగరేణి సీబీఎస్ స్కూల్‌ను ఏర్పాటు చేసి కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.సంస్థ అభివృద్ధికి ఐఎన్‌ట ీయూసీ యూనియన్ తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని కోటేశ్వరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, రీజియన్ జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జగదీష్, పిట్ సెక్రటరీలు సీతారామరాజు, నగేష్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు అంగన్వాడీ సూచనలను పాటించాలి

- **మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య**
- **బోనకల్ అంగన్వాడి కేంద్రంలో ఘనంగా అన్న ప్రాసన వేడుక**
- **ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య, బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**



**బోనకల్, ఆగస్టు 4(ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలో గల అంగన్వాడీలు సంయుక్తంగా తల్లిపాల వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య, బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ హాజరయ్యారు. పిల్లల యొక్క 1000 రోజుల ప్రాముఖ్యతను గురించి విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య వారికి వివరించారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి గర్భిణీ మహిళ తప్పకుండా అంగన్వాడీలో పేరు నమోదు చేసుకోవాలని, అంగన్వాడి కేంద్రంలో లభించే అన్ని సౌకర్యాలను వినియోగించుకోవాలని, అదేవిధంగా గర్భిణీ స్త్రీలు అంగన్వాడీ టీచర్లు చెప్పే ఆరోగ్య విషయాలను తప్పకుండా పాటించాలని, అలా పాటించినప్పుడే తల్లి బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. అదే విధంగా పుట్టినప్పటి నుండి మూడు సంవత్సరాల వరకు పిల్లలకు ఆటపాటలతో పౌష్టికాహారం అందించటం ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనకల్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు జరపల లావణ్య శివకృష్ణ, షేక్ నౌషిన్ బాజీ, అంగన్వాడీ టీచర్లు మిరియాల రమాదేవి, మర్సకట్ల మరియమ్మ, యార్లగడ్డ శిరీష, రత్నకుమారి, అంగన్వాడి ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాతర్లపాడు - రైల్వే కాలనీ మధ్య ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్



**చింతకాని ఆగస్టు 04ప్రజాజ్యోతి :**రైల్వే కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈరోజు మధ్యాహ్నం 12గంటలకు సర్పంచ్ లేతాకుల నాగేంద్ర అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు.ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన చింతకాని మండల ఎంఆర్ఓ మాట్లాడుతూ పాతర్లపాడు నుండి రైల్వే కాలనీ గ్రామానికి మధ్య ఉన్న రైల్వే ట్రాక్ పై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు.ఈ ప్రతిపాదనకు రైల్వే అధికారులు మరియు గ్రామ ప్రజలు అందరూ సమ్మతి తెలిపారు.ఈ ఫ్లైఓవర్ వల్ల చుట్టుపక్కల నాలుగు గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఎంఆర్ఓ తెలిపారు. రైల్వే ఉన్నత అధికారులు మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని 10 రోజుల్లోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. ముందుగా పాతర్లపాడు వద్ద రైల్వే ట్రాక్ ను పరిశీలించి, బ్రిడ్జికి అవసరమైన భూమి సమీకరణ గురించి వివరించారు.ఈ బ్రిడ్జి పూర్తిగా రైల్వే బడ్జెట్ తోనే నిర్మించబడుతుందని, అందువల్ల నిర్మాణం త్వరగా పూర్తవుతుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బండి నరేష్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర,వార్డ్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# చరిత్ర పుస్తకం పై మాస్టర్ ట్రైనర్ గా లెక్చరర్ తమ్మిశెట్టి శ్రీనివాస్



**కారేపల్లి, ఆగస్టు 4, ప్రజా జ్యోతి:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చరిత్ర పుస్తకంపై రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్ తమ్మిశెట్టి శ్రీనివాస్ ను మాస్టర్ ట్రైనర్ గా ఇంటర్మీడియట్ బోర్డు ఎంపిక చేసింది. మారిన చరిత్ర పుస్తకం సిలబస్ పై రాష్ట్రస్థాయిలో హిస్టరీ లెక్చరర్లకు తమ్మిశెట్టి శ్రీనివాస్ హైదరాబాద్ లోని ఇంటర్మీడియట్ బోర్డు లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో శిక్షణ ఇవ్వనున్నారు. తమ్మిశెట్టి శ్రీనివాస్ రాష్ట్రస్థాయి చరిత్ర టెస్ట్ బుక్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా కూడా కొనసాగుతున్నారు. కారేపల్లి జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ్మిశెట్టి శ్రీనివాస్ మాస్టర్ ట్రైనీగా ఎంపిక అవడం కళాశాల ప్రిన్సిపల్ ఎన్.విజయ కుమారి, అధ్యాపక బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# దివంగత చిరుముల రాములు కుటుంబానికి ఆర్థిక చేయూతనందించిన షేక్ గౌసుద్దీన్



**కారేపల్లి, ఆగస్టు 4, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రం అంబేద్కర్ కాలనీ కి చెందిన చిరుముల రాములు అనారోగ్యంతో గత వారం క్రితం మృతి చెందారు. మంగళవారం రాములు దశదిన కార్యక్రమ నిమిత్తము వారి కుటుంబ సభ్యులకు రూ 5000 లు టిఆర్ఎస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్ ఆర్థిక చేయూతగా అందించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుమల రాములు మృతి చెందడంతో ఆ కుటుంబం నిరాశ్రయులయ్యారు . వారి కుటుంబానికి ఆ దేవుడు ఓదార్పు కల్పించాలని అన్నారు. ఆపద సమయంలో మానవత్వం, మంచి మనసున్న మనిషిగా మాకు చేతనందించినందుకు గాను గౌసిద్దనికు మృతునికుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు డొంకిన రవీందర్ గౌడ్, పాలిక వీర స్వామి, కారేపల్లి మండలం బీసీ నాయకుడు పేరు వెంకటేశ్వర్లు, యువ నాయకు చింతల సంపత్ ,ఎండి ఖలీలుల్లా ఖాన్ , సోమందుల వెంకటేశ్వర్ ,బి ఆర్ ఎస్ మైనార్టీ యువ నాయకుడు షేక్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో వైభవంగా 'బోనాలు - తెలంగాణ సంస్కృతి పండుగ' వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో శ్రీ భూలక్ష్మి అమ్మవారి బోనాల సమర్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ వేడుకల్లో ఖమ్మం జిల్లా నుంచి ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దొబ్బల సౌజన్య మాట్లాడుతూ అమ్మవారి దివ్య ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని,ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పండుగ వాతావరణాన్ని నింపారు.

# "విజన్ ఆంధ్ర"పత్రికా విలేఖరికి ఘన నివాళులు

- **నివాళులర్పించిన బోనకల్, చొప్పకట్లపాలెం గ్రామాల సర్పంచులు**



**బోనకల్, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):**మండల పరిధిలోని గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన మంద సత్యానందం (విజన్ ఆంధ్ర పత్రిక విలేఖరి) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న బోనకల్, చొప్ప గట్లపాలెం గ్రామాల సర్పంచులు బానోత్ జ్యోతి కొండ, కాటేపల్లి అశ్విని శేఖర్ లు మంగళవారం వారి స్వగృమానికి వెళ్లి సత్యానందం మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మంద సత్యానందం అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పత్రికా రంగంలో నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచిన మంద సత్యానందం మరణించడం చాలా బాధాకరమని, ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. అదేవిధంగా అందరిని ఆప్యాయతతో పలకరించి మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నాడని ఈ సందర్భంగా తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో చొప్పకట్లపాలెం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తన్నీరు పుల్లారావు, గోవిందాపురం గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న యాజమాన్యంపై కేసు నమోదు

- **ఇన్స్పెక్టర్ బాలకృష్ణ**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్స్ లో ప్రదర్శన చెల్లుబాటు అయ్యే ఎలాంటి అనుమతి లేకుండా ఎస్.కె. ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్" పేరుతో ప్రదర్శనను నిర్వహిస్తున్న నిర్వాహకుడు గరిమెల్ల జానకి రామయ్య పై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. సెక్టార్ డ్యూటీ పెట్రోలింగ్ చేస్తున్న ఎస్ఐ పి. వెంకటేష్‌కు అందిన విశ్వాసనీయ సమాచారం మేరకు పెవిలియన్ గ్రౌండ్‌లో గరిమెల్ల జానకి రామయ్య అనే వ్యక్తి, సంబంధిత అధికారుల నుండి అనుమతి ఉందని తప్పుడు ప్రచారం చేస్తూ ఎస్.కె.ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్" పేరుతో ఒక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి, ప్రదర్శన నిలిపివేసినట్లు తెలిపారు.

## వారసత్వ పరంగానే వీఆర్ఏ ఉద్యోగ నియామకం

- **ఇరు కుటుంబాల అంగీకారం**
- **అధికారుల గుర్తింపు**
- **కుటుంబ సభ్యులు భాస్కర్, సుదర్శన్**



**కారేపల్లి, ఆగస్టు 4, ప్రజా జ్యోతి:** మా రెండు కుటుంబాల అంగీకారం మేరకు వారసత్వ పరంగానే వీఆర్ఏ ఉద్యోగం కల్లోజు శ్రీనివాస్ పేరున చట్టబద్ధంగానే జరిగిందని ఎవరి బినామీ కాదని కుటుంబ సభ్యులు కల్లోజి భాస్కర్, కల్లోజి సుదర్శన్ అన్నారు. సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో మంగళవారం వారు మాట్లాడుతూ కొందరు మా అన్న శ్రీనివాస పై ఉద్దేశపూర్వకంగా నిరాధార ఆరోపణలు చేసినట్లు తెలిపారు. వీఆర్ఏ నియామకం చట్టబద్ధమైందని ఇది యదార్థమని అన్నారు. మాపై కొందరు కుట్రపూరితంగా చేసిన ఆరోపణలు అనివార్యమని అన్నారు. ఇరు కుటుంబాల సభ్యులు గ్రామస్తుల సమక్షంలో జరిగిన ఒప్పందం మేరకే శ్రీనివాసును వీఆర్ఏగా వారసత్వంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.. గతంలో లో ఎమ్మార్వో వృత్తి పరమైన గుర్తింపు ఐడి కూడా జారీ చేసినట్లు తెలిపారు.

## పోరాటాలతోనేకార్మికుల హక్కుల రక్షణ

- **జైల్ భరో ను జయప్రదం చేయండి**



**కారేపల్లి, ఆగస్టు 4, ప్రజా జ్యోతి:** పోరాటాలతోనే కార్మికుల హక్కుల రక్షించబడతాయని సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర అన్నారు. మంగళవారం సింగరేణి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) జనరల్ బాడీ సమావేశం యూనియన్ మండల అధ్యక్షురాలు వాంకుడోత్ కమల అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో కే.నరేంద్రం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టే విధంగా ప్రజా ఉద్యమాలకు బాధిత కార్మికులు మద్దతు ఇవ్వాలన్నారు. గ్రామాలలో వైద్య శాఖ వెన్నుముక్కగా ఉన్నఆరోగ్యకార్యకర్తలు(ఆశా) పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులగాగుర్తించి కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఆగస్టు 10న జరగనున్న జైల్ భరో ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జిల్లా నాయకురాలు వై.రాధ, పద్మ, జంగా కళ్యాణి, ఈసం ఈశ్వరి, సరస్వతి, వై పద్మ, ఆదెర్ల దేవకరణ, మేదరి కుమారి, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ బీ.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలను ప్రభుత్వము వెంటనే పరిష్కరించాలి

- **టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు**



**నెలకొండపల్లి, ఆగస్టు 4 ప్రజా జ్యోతి :** ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి 15% నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యుకెజి కే పరిమితం చేశారని, ప్రీప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12.00 గంటల వరకే నడపాలన్నారు కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4.00వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12.00 తర్వాత పసి పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని అన్నారు.ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఒ 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్ ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డిఈఒ, రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఇఒ, అన్ని మండలాలకు ఎంఈఒ పోస్టులు మంజూరు చేయాలని, పిఒ 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదని యుయస్పిసి నాయకులు విమర్శించారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, టెట్ లో సర్వీసు వెయిటేజ్ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2003 డియస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖ లో బిసి, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్ స్కూల్స్ ను, ఎయిడెడ్ స్కూల్స్ ను విద్యాశాఖలో విలీనం చేయాలని, కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జిఒ 317 బాధితులకు న్యాయం చేయాలని, జిఒ 190 అమలు చేయాలని, 5 వాయిదాల కరువు భత్యం (డిఎ) ను వెంటనే ప్రకటించాలని, పిఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను ప్రతి నెల రూ 2000కోట్ల చొప్పున విడుదల చేయాలని, హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగస్తులకు ఆరోగ్య భద్రత కల్పించే విధంగా ఉండాలని ఆయన కోరారు.ఆమేరకు ఆగస్టు 7న నల్ల బ్యాడ్జీలతో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసనలు, ఆనాటి నుండి పిఆర్సీ ప్రకటించేదాకా ప్రతిరోజూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని యుయస్పిసి పిలుపునిచ్చింది. ఆగస్టు 12,13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, తహసీల్దార్లకు మెమోరాండంలు, ఆగస్టు 19 నాడు జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని, ఆగస్టు 29న హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్ లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ కార్యక్రమం ఉంటుందని,అన్ని సంఘాలు ఐక్య పోరాటాలకు కలిసి రావాలని, ఉపాధ్యాయులు అందరూ సంఘాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.మండల సభ్యత్వ క్యాంపైన్ లో భాగంగా నేలకొండపల్లి మండలం నందు,మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి రామారావు పి గోవిందరావు మండల సబ్ కమిటీ సభ్యులు జై జై ప్రధానోపాధ్యాయులు టి కమలాకర్ గారు, రవి, గణేష్, భాగ్యలక్ష్మి, చీనా వెంకన్న, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినులకు 80 కేజీల స్వీట్ కార్న్ పంపిణీ



**ముదిగొండ ఆగస్ట్ 4(ప్రజా జ్యోతి )**ఎడవల్లి లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓరుగంటి లక్ష్మయ్య ఉదారత చాటుకున్నారు. న్యూ లక్ష్మీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ ) విద్యార్థినుల కోసం ఆయన 80 కేజీల స్వీట్ కార్న్ కంకులను అందజేశారు.ఈ స్వీట్ కార్న్ కంకులను స్థానిక గ్రామ ప్రముఖులు, పెద్ద గౌడ్ గడ్డం కుమారస్వామి గౌడ్ చేతుల మీదుగా పాఠశాల విద్యార్థినులకు పంపిణీ చేశారు కస్తూర్బా విద్యాలయం, పాఠశాల ఉపాధ్యాయినులు, సిబ్బంది మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థినుల పట్ల లక్ష్మయ్య చూపిన అభిమానాన్ని, సహకరించిన గ్రామ పెద్దలను గ్రామస్తులు అభినందించారు.

## చొప్పకట్లపాలెంలో తల్లిపాల వారోత్సవాలు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని చొప్పకట్లపాలెం అంగన్వాడి వన్ మరియు టూ సెంటర్ లో మంగళ వారం తల్లి పాల వారోత్సవాలు జరుపుకోవడం జరిగినది.దీనిలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ టి సరిత ఆధ్వర్యంలో తల్లులకు అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాగ్రామ సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి హాజరైనారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన దగ్గర నుండి ఆరు నెలల వరకు చంటి పిల్లలకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని తల్లిపాలల్లోనే అనేక రకాల పోషక పదార్థాలు ఉన్నాయని డబ్బా పాల కన్నా తల్లిపాలు మిన్నని తల్లిపాలు విలువ గురించిఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అక్కమ్మ, రుక్మిణి గర్భిణీలు స్త్రీలు బాలింతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జైల్ భరో కార్యక్రమం జయప్రదం చేయండి

- **సీఐటీయూ జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు**



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని దానికి వ్యతిరేకంగా ఈనెల 10వ తారీఖున ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ కుమార్ కు మంగళ వారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కో కన్వీనర్ దూదిగం బసవయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలు కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా విభజిస్తూ కార్మిక హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా కార్మిక లోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10వ తారీఖున జరిగే జైల్ భరో కార్యక్రమానికి దేశవ్యాప్త నిరసనకు కార్మికులంతా ఐక్యంగా కదిలి రావాలని నిరసన కార్యక్రమాలలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు, సౌకర్యాలపై ఉద్యోగ భద్రత దాడి చేస్తూ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలగా మార్చాలని కుట్ర చేయడం దారుణమని సిగ్గు చేటన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు నంద్రు సుధారాణి,సంధ్యరాణి,వెంకటరమణ, ఏసుమణీ,విజయ లక్ష్మి,సుజాత నాగమణి,వై నాగమణి వేల్పుల రత్నకుమారి కొత్తపల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా సత్యానందం అంత్యక్రియలు

- సిపిఎం ఒక గొప్ప కార్యకర్తను కోల్పోయింది
- సిపిఎం అంటే తన ప్రాణం అంటూ భావించిన వ్యక్తి సత్యానందం
- సత్యానందం మరణం సిపిఎం పార్టీకి తీరని లోటు
- సత్యానందం అంతిమ యాత్రలో సిపిఎం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు





**బోనకల్, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ కార్యకర్త మంద సత్యానందం(35) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. సత్యానందం మరణంతో వారి కుటుంబం, గోవిందపురం ఎల్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు సత్యానందం కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాధాకరమైన విషయం ఏమిటంటే పెద్ద కుమారుడికి 8 సంవత్సరాలు, రెండో కుమారుడికి 6 సంవత్సరాలు, కుమార్తెకు 4 సంవత్సరాలు కావడం విశేషం. ఊహ తెలియని అతి చిన్న వయసులోనే ఆ ముగ్గురు బిడ్డలు తండ్రిని కోల్పోవడంతో గోవిందాపురం ఎల్ గ్రామస్తులు ఆయన పిల్లలను చూసి కన్నీటి పర్వతమయ్యారు. కుటుంబ పెద్దగా ఉన్న సత్యానందం మరణంతో ఆయన ముగ్గురు పిల్లలు తన తండ్రి చివరి చూపు కోసం ఎదురు చూస్తున్న పరిస్థితిని చూసి ఆ గ్రామస్తులలో కంటతడి పెట్టనివారంటూ లేరు. సిపిఎం పార్టీకి మాయని మచ్చగా ఉన్న సత్యానందం అంత్యక్రియలను గోవిందాపురం ఎల్ సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సత్యానందం అంత్యక్రియలకు సిపిఎం పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, పత్రికా రంగ ఉమ్మడి జిల్లాల నాయకులు అత్యధికంగా హాజరయ్యారు. అనంతరం సత్యానందం మృతదేహానికి సిపిఎం నాయకులు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. సత్యానందం మరణంతో ఆ గ్రామ సర్పంచ్ మంద కరుణ తన కుడి భుజాన్ని కోల్పోయిన బాధను తట్టుకోలేక కన్నీరు పెట్టుకున్న విషయాన్ని చూసి ఆ గ్రామస్తులు సత్యానందం మరణంతో మరింత బాధాకరమైన విషయాన్ని చూశారు. ఈ సందర్భంగా హాజరైన నాయకులు మాట్లాడుతూ... గోవిందపురం ఎల్ గ్రామంలో ఒక మంచి సిపిఎం కార్యకర్తను కోల్పోయామని, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఎటువంటి వివాదాలకు తావునివ్వకుండా అందరితో కలిసిమెలిసిగా పనిచేసి పార్టీ కార్యక్రమాలకు తన వంతు పాత్ర కీలకంగా పోషించేవాడని అన్నారు. సిపిఎం పార్టీ అంటే తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పనిచేసి ఎవరికి భయపడకుండా తన శక్తివంచనతో ధైర్యంగా నిలబడ్డ మంద సత్యానందం సిపిఎం పార్టీ నుండి దూరం కావడం చాలా బాధాకరమని, సిపిఎం పార్టీ గోవిందపురం ఎల్ గ్రామంలో ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. అదే విధంగా ఎర్ర జెండా అంటే తన ప్రాణంతో పాటు భావించేవాడని అన్నారు. అలాంటి వ్యక్తి సిపిఎం పార్టీకి దూరమవడం చాలా బాధాకరమని, సత్యానందం మరణం సిపిఎం పార్టీకి తీరని లోటు అని నాయకులు అన్నారు. సత్యానందం అంతిమయాత్ర లో సిపిఎం సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బొంతు రాంబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సిపిఎం బోనకల్ మండల కార్యదర్శి కిలారు సురేష్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు, పెద్ద బీరవల్లి సర్పంచ్ చింతలచెరువు కోటేశ్వరరావు, గోవిందపురం ఎల్ గ్రామ సర్పంచ్ మంద కరుణ, లక్ష్మీపురం సహకార సంఘం అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, గోవిందపురం ఎల్ ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, కెవిపిఎస్ జిల్లా నాయకులు నందిపాటి మనోహర్, సిపిఎం మధిర డివిజన్ కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకులు బంధం శ్రీనివాసరావు, పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు, చొప్పకట్లపాలెం ఉప సర్పంచ్ పల్లా కొండలరావు, గోవిందాపురం ఎల్ గ్రామ సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.



## గేమ్స్ మెటీరియల్ పరిశీలించిన ఆడిటర్ చైతన్యకుమార్



**ఎరుపాలెం ప్రజా జ్యోతి** ప్రభుత్వ ఆదేశాల మేరకు సోషల్ ఆడిట్ కు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు,ఆర్థిక లావాదేవీలను మంగళవారం స్టేట్ ఆడిటర్ చైతన్యకుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మామునూరులో రికార్డులు పరిశీలించారు. అలానే జమలాపురం, రాజుపాలెం, భీమవరం, మధ్యాహ్నం భోజనం విద్యార్థులు చదువు క్రీడలు ఉపాధ్యాయుల సమయపాలన, ప్రభుత్వం అందించే పథకాలపై విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకొని అన్ని విషయాలు విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదులు వసతులు, వాష్ రూమ్, తాగునీరు, ఫ్యాన్లు, విద్యార్థుల హాజరు శాతం అన్ని విషయాలను, క్షుణ్ణంగా పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయుల శ్యాంబాబు వద్ద నివేదిక తీసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. సందర్భంగా చైతన్య కుమార్ పలు సూచన సలహాలు చేశారు. ఈ నివేదికను రాష్ట్ర విద్యాశాఖకు పంపనన్నారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉండాలని అన్నారు. తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు, ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. విద్యార్థులు సంఖ్య పెరిగే విధంగా సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దబాబు సాహెబ్, ఎంఈఓ మురళీ మోహన రావు, సెక్రటరీ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకమ్మ ,పుల్లయ్య, ఫిజికల్ డైరెక్టర్ మారాబత్తుల జమలయ్య, కోట బాబి, ఎం. శంకర్ ,నాగేశ్వర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాత్రికేయుడు ప్రెస్ క్లబ్ నివాళి



**మధిర ప్రజా జ్యోతి** బోనకల్లు మండలం గోవిందపురం గ్రామానికి చెందిన విజన్ ఆంధ్ర రిపోర్టర్ మంద సత్యానందం గత రాత్రి రావినూతల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పాత్రికేయలలో తీవ్ర విషాదంలో ముంచింది. మంగళవారం మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మధిర ప్రెస్ క్లబ్ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని మంద సత్యానందం భౌతికకాయానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంద సత్యానందం మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రా ర్థించారు. ఈ కార్యక్రమంలో మధిర ప్రెస్ క్లబ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జి.వి, ప్రచార కార్యదర్శి అర్జున్, కార్యవర్గ సభ్యులు విజయ రాజు, వేణు, జైశీలుడు,కోటి, సంతోష్, నాగరాజు, చెందిన పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## మండలంలో తల్లిపాల వారోత్సవాలు



**కల్లూరు ఆగస్టు 04 : ప్రజా జ్యోతి** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల సెక్టార్ లో ఓబుల్ రావు బంజారా పాయపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముచ్చవరం-2 బాలాజీ నగర్ పాయపూర్ అంగన్వాడి కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబుల్ రావు బంజారా సర్పంచ్ మాలోతు అనురాధ నరసింహారావు పాయపూరు సర్పంచ్ కోలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలే ఉత్తమ ఆహారమని తెలిపారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా శిశువుకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని పిల్లలకు తప్పనిసరిగా అన్ని వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా తల్లి బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సుజాత, గ్రామ సచివాలయ కార్యదర్శి అనూష, అంగనవాడి టీచర్లు వరలక్ష్మి, వెంకటలక్ష్మి, స్వరాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

## దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేస్ -2 అడ్మిషన్లు ప్రారంభం

- ప్రిన్సిపల్ డా.రవీంద్ర రెడ్డి




**మధిర ప్రజా జ్యోతి** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేస్ -2 అడ్మిషన్లు ఆగస్టు 06వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రవీంద్రారెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ స్పెషల్ డ్రైవ్ ఫేస్ -2 లో రిజిస్ట్రేషన్లు ఆగస్టు 06 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించబడతాయని, వెబ్ ఆప్షన్ల నమోదుకు ఆగస్టు 12వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. గత దశల్లో వివిధ కారణాల వల్ల నమోదు చేసుకోలేకపోయిన విద్యార్థులకు ఇది చివరి అవకాశం కావడంతో అర్హులైన ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ ఫేస్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు స్కాలర్‌షిప్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, స్కాలర్‌షిప్ పొందదలచిన విద్యార్థులకు ఇదే చివరి అవకాశం అని తెలిపారు. అలాగే బీకాం కోర్సులో కేవలం మూడు సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో పీహెచ్‌డీ, సెట్, నెట్ అర్హతలు కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు.మరిన్ని వివరాల కోసం కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రవీంద్రారెడ్డి (9440257256), వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి జి. అరుణ (9441786508), దోస్త్ సమన్వయకర్త డా. ఎస్. ఇందిర (9553359879), డా. పి. సుజాత (9177734879)లను సంప్రదించాలని కోరారు.

## వ్యవసాయ శాఖ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి

**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని మంగళవారం ఖమ్మం లో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఎర్రుపాలెం మండలం లోని అన్ని గ్రామలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగుకు అవసరమైన యూరియా ఎరువులను అందుబాటులో , సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా రైతులకు సకాలంలో యూరియా ఎరువును అందుబాటులో ఉంచేలా తగిన చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అయిలూరి వెంకటేశ్వరరెడ్డి మంత్రిని కోరారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొంటూ, అధికారులు అవసరమైన చర్యలు తీసుకునేలా సూచిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోలుగుమాడు సోసైటీ చైర్మన్ శెట్టిపల్లి మదన్ మోహన్ రెడ్డి, మీనవోలు సోసైటీ చైర్మన్ కుడుముల మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

